
# సాక్షి
# జోగులాంబ గద్వాల
శనివారం । 5 । ఆగస్టు । 2023






**నేతన్న కళకు పురస్కారం**
చేనేత రాష్ట్రస్థాయి పురస్కారాలకు 9 మంది కార్మికులు ఎంపికయ్యారు.
వివరాలు 10లో ▸



**53 వేల క్యూసెక్కులు..**
ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు 53 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుంది.
వివరాలు 10లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
32.7 /23.4

**వాతావరణం**
ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం. రాత్రి వేళల్లో మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### రైతుబీమాకు దరఖాస్తు చేసుకోండి

గద్వాల వ్యవసాయం: ఈ ఏడాది జూన్ 18లోగా కొత్తగా పట్టాదారు పుస్తకం పొందిన రైతులు, ఇంతవరకు బీమాకు నమోదు చేసుకోని 18 నుంచి 59 ఏళ్లలోపు వయస్సు రైతులు రైతుబీమాకై దరఖాస్తులు అందించాలని డీఏఓ గోవిందునాయక్ సూచించారు. శుక్రవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ.. కొత్తగా బీమా చేసుకునేందుకు ఈనెల 5 చివరి తేదీగా పేర్కొన్నారు. అర్హత గల రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ పుస్తకం, నామినీ ఆధార్ కార్డు జిరాక్స్ పత్రాలను దరఖాస్తు ఫారముకు జత చేసి ఆయా గ్రామాల్లో వ్యవసాయ విస్తరణ అధికారులకు అందజేయాలని కోరారు. రైతు బీమా పథకం 2018 ఆగస్టు 14న ప్రారంభమైందని చెప్పారు. ఇప్పటి వరకు ఐదు పాలసీ సంవత్సరాలు పూర్తి అయ్యిందన్నారు. ఈనెల 14 నుంచి 6వ పాలసీ సంవత్సరంలో రైతుబీమా అడుగుపెట్టనుందన్నారు. గత పాలసీ సంవత్సరాల్లో నమోదు చేసుకున్న వారు ఆటోమేటిక్‌గా రెన్యూవల్ అవుతారని తెలిపారు. 2023 జూన్ 18లోపు కొత్తగా పట్టాదారు పాసుపుస్తకం పొంది అర్హత కల్గిన రైతులు తప్పక రైతు బీమా చేయించుకోవాలని సూచించారు.

### విద్యార్థులకు అభినందనలు



అయిజ: క్రీడా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి సౌత్ ఏషియా అథ్లెటిక్స్ పోటీలకు మండలంలోని భూంపురానికి చెందిన విద్యార్థులు మానస, ఉమ, నందిని, రాజేశ్వరి, సరస్వతి ఎంపికయ్యారు. దీంతో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ ఆంజనేయగౌడ్ వీరిని అభినందించారు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియం స్పోర్ట్స్ కార్యాలయంలో విద్యార్థులతోపాటు కోచ్ సురేష్‌ను శాలువాతో సత్కరించారు. ఈసందర్భంగా ఆంజనేయగౌడ్ మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రతిభ కనబరిచి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని, క్రీడా ప్రాధికార సంస్థ తరుపున ప్రోత్సాహం ఉంటుందని అన్నారు.

### ఎన్నికలకు సిద్ధం కండి



శాంతినగర్: కాంగ్రెస్‌పార్టీ అధికారంలో ఉన్న సమయంలో ఇచ్చిన ఎన్నో హామీలు నెరవేర్చిందని, ఈ విషయాలన్నింటిని ప్రతి గ్రామంలో ఇంటింటా ప్రచారం చేపట్టి ప్రజలకు వివరించాలని, ప్రతి కార్యకర్త ఎన్నికలకు సిద్ధం కావాలని, కష్టపడితేనే గెలుపు సాధ్యమని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ కాంగ్రెస్‌పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్ కాంగ్రెస్‌పార్టీ క్యాంపు కార్యాలయంలో నాయకులు, కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించగా ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇస్తున్న పథకాలకు కాంగ్రెస్ ప్రభుత్వం రెట్టింపు ఇస్తుందని వివరించాలన్నారు. త్వరలో మేనిఫెస్టోకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేస్తామని చెప్పారు. కర్ణాటక తరహాలో తెలంగాణలో విజయం తథ్యమన్నారు. అనంతరం ఈసందర్భంగా ఆయా మండలాలకు చెందిన కాంగ్రెస్‌పార్టీ మహిళా అధ్యక్షులను ఎంపిక చేసి నియామక పత్రాలను అందజేశారు. వడ్డేపల్లి పట్టణ మహిళా అధ్యక్షురాలిగా మున్సిపల్ వైస్ చైర్మన్ సుజాత, మండల అధ్యక్షురాలిగా జయమ్మ, అయిజ సులోచనమ్మ, సుగుణమ్మ, అలంపూర్‌లో నాగవేణి, పార్వతమ్మ, మానవపాడు మహేశ్వరి, రాధమ్మ, ఉండవెల్లి జయలక్ష్మి, అలంపూర్ జ్యోతికి నియామక పత్రాలు ఇచ్చారు. అదేవిధంగా, రెండేళ్ల శిక్ష కేసులో రాహుల్‌గాంధీకి సుప్రీం కోర్టు స్టే ఇవ్వడంపై నాయకులు బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో రామకృష్ణారెడ్డి, దేవేంద్ర, నాగశిరోమణి, కౌన్సిలర్లు దేవమ్మ, శ్రీలత, చిన్నిబాబు తదితరులు పాల్గొన్నారు.

### వేరుశనగ క్వింటా రూ.6,877



గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్ యార్డుకు శుక్రవారం 1135 క్వింటాళ్ల వేరుశనగ రాగా, క్వింటాకు గరిష్టం రూ.6877, కనిష్టం రూ. 3501, సరాసరి రూ. 5450 ధరలు లభించాయి.

# పరిహారం.. పరిహాసం

## నకిలీ పట్టాలతో డబుల్ క్లెయిమ్ చేసిన వైనం



గట్టు ఎత్తిపోతలలో ముంపునకు గురవుతున్న మార్లబీడు-గట్టు రహదారి

- రైతులే కాని వారి పేర్లపై మింగేసిన పరిహారం సొమ్ము
- కొందరు అధికారులు, న్యాయవాదుల పాత్ర
- బదిలీపై వెళ్లిన డివిజనల్ అధికారే కీలక సూత్రధారి
- కోర్టులో అడ్డంగా దొరికిపోయిన పెద్దలు.. కలెక్టర్‌కు చేరిన చిట్టా
- నెట్టెంపాడు, గట్టు ఎత్తిపోతల పథకాల్లో వెలుగు చూస్తున్న అక్రమాలు

గద్వాల రూరల్: సమాజంలో పలుకుబడి ఉన్న కొందరు న్యాయవాదులు.. అక్రమాలకు అలవాటు పడ్డ కొందరు అధికారులు కలిసి ప్రభుత్వ నిబంధనల్లోని వెసులుబాటును ఆసరాగా చేసుకొని అక్రమాలకు తెరలేపారు. ఒక రైతు పేరిట రెండుసార్లు పరిహారం (డబుల్ క్లెయిమ్), రైతులే కాని వారి పేరిట పరిహారం తీసుకొని పెద్ద ఎత్తున ప్రజాధనాన్ని లూటీ చేశారు. ఈ మొత్తం వ్యవహారంలో రెవెన్యూ శాఖలో సుదీర్ఘ కాలం పనిచేసిన వివాదాస్పద అధికారే కీలక సూత్రధారి అని తెలిసింది. ఉన్నతాధికారుల కళ్లు కప్పిన అక్రమార్కులు చివరికి కోర్టులో దొరికిపోయారు. అక్రమార్కుల చిట్టాను సదరు జడ్జి.. కలెక్టర్‌కు చేరవేశారు. ప్రస్తుతం ఇదే విషయం గద్వాలలో చర్చనీయంశంగా మారింది.



చిన్నోనిపల్లి రిజర్వాయర్

**డబుల్ క్లెయిమ్..**

2013లో ధరూరు మండలం మార్లబీడు నుంచి గట్టు వరకు వేసిన రోడ్డులో తుమ్మలచెర్వు శివారులో పరిహారాన్ని దోచేందుకు పథకం పన్నారు. ఇందుకోసం భూసేకరణ కార్యాలయంలో పనిచేసిన కీలకఅధికారి సాయంతో సుమారు 30ఎకరాలకు సంబంధించిన పరిహారాన్ని డబుల్ క్లెయిమ్ చేశారు. మొదటి విడతలో పరిహారం తీసుకున్న లబ్ధిదారులు తమ భూములకు ఎక్కువ పరిహారం పొందేందుకు కోర్టును ఆశ్రయించవచ్చు. ఇక్కడే కొందరు పలుకుబడి న్యాయవాదులు, వివాదాస్పద డివిజనల్ అధికారి కలిసి అక్రమాలకు పాల్పడ్డారు. ఒక లబ్ధిదారుడి పేరిట రెండు ప్రొసీడింగ్స్ ఇచ్చి డబుల్ క్లెయిమ్ చేసి ప్రజాధనాన్ని లూటీ చేసేందుకు యత్నించినట్లు సమాచారం. వివాదాస్పద డివిజనల్ అధికారి సాయంతో జిల్లా ఉన్నతాధికారులను కళ్లు కప్పి సదరు న్యాయవాదులు చివరకు కోర్టులో దొరికిపోయారు.

### వాస్తవాలు నివేదిస్తాం

**చిన్నోనిపల్లి రిజర్వాయర్ భూముల ఆరోపణల వ్యవహారంపై రికార్డుల పరంగా విచారిస్తున్నాం. భూములకు సంబంధించి వాస్తవా**లను సిద్ధం చేస్తున్నాం. తదుపరి చర్యల నిమిత్తం నివేదికను ఉన్నతాధికారులకు పంపుతాం.
– ఎండీ జుబేర్ అహ్మద్, తహసీల్దార్, గట్టు

### విచారణ జరుపుతాం..

రోడ్డుకు సంబంధించి డబుల్‌క్లెయిమ్, గట్టు ఎత్తిపోతలలో జరిగిన పరిహారం వ్యవహారాలపై వివరాలు తెలియవు. నేను ఇటీవల వచ్చాను. సంబంధిత తహసీల్దార్‌తో రికార్డులు తెప్పించుకుని వివరాలు సేకరిస్తాం. మీరు చెబుతున్నట్లు అక్రమాలు జరిగినట్లు తేలితే చర్యల నిమిత్తం ఉన్నతాధికారులకు తెలియజేస్తాం. – చంద్రకళ, ఆర్డీఓ, గద్వాల

### ఫేక్ సర్టిఫికెట్లతో..

ఇదిలాఉండగా గట్టు ఎత్తిపోతల పథకంలో భాగంగా 955.45ఎకరాలు ముంపునకు గురవుతుంది. ఇందులో 574ఎకరాల భూమి అసైన్డ్ భూమి ఉంది. ఇక్కడ సైతం సదరు కీలక డివిజనల్ అధికారి పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. భూసేకరణ కార్యాయంలో తనకు అనుకూలంగా ఉండే అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సాయంతో నిజమైన రైతులను పక్కన పెట్టి ఫేక్ పట్టాలు సృష్టించి రైతులు కాని వారి పేరిట పరిహారం ఎత్తేశారు. ఇలా సుమారు రూ.3.76కోట్ల వరకు ప్రజాధనం లూటీ చేసినట్లు తెలిసింది. అయితే సదరు వివాదాస్పద కీలక డివిజనల్ అధికారి ప్రభుత్వ నిబంధన వెసులుబాటు (పొజిషన్) అంశాన్ని ఆసరాగా చేసుకుని ఏకంగా జిల్లా ఉన్నతాధికారిని సైతం పక్కదారి పట్టించి అక్రమాలకు తెగబడినట్లు తెలిసింది. దీంతో నిజమైన రైతులు తమ భూములు ముంపునకు గురైనప్పటికీ పరిహారం రాక ఆఫీసుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న దుస్థితి.

### చిన్నోనిపల్లి రిజర్వాయర్‌లో సైతం

గట్టు ఎత్తిపోతల పథకంలో భాగంగా గట్టు మండలంలో చిన్నోనిపల్లి రిజర్వాయర్‌ను నిర్మించారు. ఇందులో సర్వే నంబర్లు 421, 437, 429, 268, 247, 307, 412, 423, 410లలో మొత్తం 312 ప్రభుత్వ అసైన్డ్ భూమి ముంపునకు గురైంది. మొదటి అవార్డులో 68ఎకరాలకు పరిహారం మంజూరైంది. పరిహారంలో అక్రమాలు చోటుచేసుకున్నాయని పేర్కొంటూ దీనిపై 2021–22 సీఎం కార్యాలయానికి ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో కొంతకాలం వరకు దీనిని పక్కన పెట్టేశారు. అయితే తను బదిలీ అవుతానని ఏం చేసినా ఇబ్బంది ఉండదనుకున్న సదరు డివిజనల్ అధికారి ఈభూముల రికార్డులను బయటకు తీశారు. దీనిపై అక్రమాలకు అనుకూలించేలా సర్వే రిపోర్టు, ఫేక్ రైతుల జాబితా సిద్ధం చేసి తుది నివేదిక కోసం గట్టు తహసీల్దార్ కార్యాలయానికి పంపారు. ప్రస్తుతం దీనిపై తుది నివేదికను సిద్ధం చేసి గట్టు తహసీల్దార్ ఉన్నతాధికారులకు పంపాల్సి ఉంది. దీనివెనకాల మండలానికి చెందిన ముఖ్యులు పలుకుబడితో పైరవీలు చేస్తున్నట్లు తెలిసింది. వాస్తవానికి ఈ భూములన్నీ కూడా రికార్డు పరంగా ఎక్కడా లేవని మొత్తం నకిలీవి అని పేర్కొంటూ గతంలో పనిచేసిన తహసీల్దార్ సమగ్ర నివేదిక ఉన్నతాధికారులకు ఇవ్వడం.. ఇపుడు ఇదే భూములపై పరిహారం కొట్టేసేందుకు ప్రయత్నాలు జరుగుతుండడం గమనార్హం.

# పట్టణాలకు.. 'అమృత్'



వడ్డేపల్లి మున్సిపాలిటీలో బండిపై నీటిని తీసుకెళ్తున్న మహిళ (ఫైల్)

**రాబోయే 30 ఏళ్లకు సరిపడా నీరిచ్చేలా ప్రణాళిక**

- రూ.664.64 కోట్లతో అమృత్ అర్బన్- 2.0 రూపకల్పన
- ఇప్పటికే టెండర్లు పిలిచిన ప్రభుత్వం
- ఐదేళ్లపాటు నిర్వహణ బాధ్యత కాంట్రాక్టు సంస్థదే..
- ఉమ్మడి జిల్లాలోని 16 మున్సిపాలిటీల్లో అమలు

అచ్చంపేట: పట్టణ ప్రజలకు ప్రతిరోజు తాగునీరు అందించేందుకు ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రాబోయే 30 ఏళ్లకు సరిపడా నీరిచ్చేలా అమృత్ పథకం అర్బన్ 2.0 తాగునీటి పథకానికి రూపకల్పన చేసింది. ఇందులో భాగంగా ప్రతి పౌరుడికి ప్రతిరోజు 135 లీటర్ల నీటిని అందిస్తూ.. ఇంటింటికీ నల్లా కనెక్షన్, కొత్త పైపులైన్ల ఏర్పాటు, ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం చేపట్టనున్నారు. ఈ మేరకు రెండో దశలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 19 మున్సిపాలిటీలు ఉండగా 16 మున్సిపాలిటీల్లో కేంద్ర ప్రభుత్వ సహకారంతో అమలు చేసేందుకు రూ.664.64 కోట్ల నిధులు కేటాయించారు. ఇప్పటికే ప్రారంభమైన మిషన్ భగీరథ–1 పథకం ఎల్లూరు రిజర్వాయర్ నుంచి నీటి సరఫరా చేసేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు. ఇందుకోసం జూన్‌లో ఆన్‌లైన్ టెండర్లు పిలవగా.. ఈ నెల వరకు చివరి గడువు నిర్ణయించారు. టెండర్లు ఓపెన్ చేసి నిబంధనల ప్రకారం కాంట్రాక్టు సంస్థలను ఎంపిక చేయనున్నారు.

### తీరనున్న ఇబ్బందులు..

పట్టణాల్లో ఏటేటా భవన నిర్మాణాలతోపాటు జనాభా పెరుగుతుంది. అందుకు అనుగుణంగా నీటి సరఫరా లేకపోవడంతో ఆయా కాలనీవాసులు తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్త మున్సిపాలిటీలు ఏర్పడటం, పాత మున్సిపాలిటీల్లో సమీప గ్రామాలు విలీనం కావడంతో తాగునీటి సమస్య తలెత్తుతోంది. దీంతో ఆయా మున్సిపాలిటీల పరిధిలో రెండు, మూడు రోజులకోసారి నీటి సరఫరా చేస్తున్నారు. పట్టణాల్లోని వివిధ కాలనీల్లో మిషన్ భగీరథ ద్వారా అవసరం మేరకు నీటి సరఫరా జరగడం లేదు. దీంతో స్థానికంగా బోరు మోటార్లపై ఆధారపడాల్సి వస్తోంది. ప్రస్తుతం ఆయా మున్సిపాలిటీల్లో మిషన్ భగీరథ పథకం కింద నిర్మించిన ట్యాంకులు, పైపులైన్లు సరిపోకవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని గుర్తించిన ప్రభుత్వం మిషన్ భగీరథం–2.0 అమలు చేయాలని నిర్ణయించింది. అమృత్ పథకం ద్వారా సమస్యకు పరిష్కారం లభిస్తుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.

**తాగునీటి పథకాలకు కేటాయించిన నిధులు**

| మున్సిపాలిటీ | నిధులు (రూ.కోట్లలో..) |
|---|---|
| మహబూబ్‌నగర్ | 266.80 |
| వనపర్తి | 72.36 |
| గద్వాల | 63.25 |
| జడ్చర్ల | 47.00 |
| నాగర్‌కర్నూల్ | 36.23 |
| నారాయణపేట | 27.66 |
| కల్వకుర్తి | 23.50 |
| భూత్పూర్ | 17.45 |
| ఆత్మకూర్ | 17.22 |
| మక్తల్ | 15.38 |
| కొత్తకోట | 14.95 |
| అలంపూర్ | 14.80 |
| అమరచింత | 13.34 |
| కోస్గి | 12.53 |
| వడ్డేపల్లి | 11.41 |
| పెబ్బేరు | 10.76 |

### ప్రజారోగ్యశాఖ పర్యవేక్షణ

అమృత్ పథకం కింద అందిస్తున్న తాగునీటి పథకం పర్యవేక్షణ బాధ్యత ప్రజారోగ్య శాఖ చేపట్టనుంది. క్షేత్రస్థాయిలో పైపులైన్ల లీకేజీలు, పైపులు పగిలిపోవడం, కొత్త విధానంతో ప్రజారోగ్యశాఖ పర్యవేక్షణలో సంబంధిత కాంట్రాక్టు సంస్థ ఐదేళ్లపాటు నిర్వహణ చూసుకోవాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు మున్సిపాలిటీల్లో తాగునీటి పథకాలు పూర్తి చేసిన వెంటనే ఆ బాధ్యత మున్సిపాలిటీకి అప్పగించేవారు. కొత్త విధానంతో తాగునీటి సరఫరాలో లోపాలు జరిగితే సరిదిద్దడం, మరమ్మతు చేయడం వంటి పనులను కాంట్రాక్టు సంస్థనే చూసుకునేలా నిబంధనలు రూపొందించారు.

### ఆన్‌లైన్ విధానంలో..

గతంలో మాదిరిగా కాకుండా నూతన టెక్నాలజీ సిస్టం ద్వారా తాగునీటి సరఫరా చేయనున్నారు. ఆయా మున్సిపాలిటీల్లో స్కాడా పేరుతో కంప్యూటర్లను ఏర్పాటు చేస్తారు. పట్టణాల్లోని ప్రధాన ట్యాంకుల ద్వారా ఎప్పుడు ఎంత తాగునీటిని విడుదల చేస్తున్నారో.. పూర్తి సమాచారం ఆన్‌లైన్ ద్వారా తెలుసుకునే విధానాన్ని అమలు చేయనున్నారు. దీంతో నీటి సరఫరాలో ఏర్పడే అంతరాయాన్ని సులభంగా తెలుసుకోవడానికి వీలవుతుందని అధికారులు చెబుతున్నారు.

### ప్రభుత్వానికి ప్రతిపాదనలు..

అమృత్ పథకం కింద రెండో దశలో జిల్లాలోని నాగర్‌కర్నూల్, కల్వకుర్తి మున్సిపాలిటీలకు నిధులు మంజూరై టెండర్ దశలో ఉన్నాయి. మూడో దశలో అచ్చంపేట, కొల్లాపూర్ మున్సిపాలిటీలకు సంబంధించి అధికారులు ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపించారు. అచ్చంపేట పట్టణానికి రూ.12 కోట్లు, కొల్లాపూర్ పట్టణానికి రూ.10 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. మూడో విడతలో ఈ రెండు మున్సిపాలిటీలకు నిధులు మంజూరయ్యే అవకాశం ఉంది.

### టెండర్ దశలో..

రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీల్లో నీటి సమస్య లేకుండా అమృత్ పథకం ద్వారా తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకుంటుంది. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని అవసరమైన నీటికి ప్రణాళిక రూపొందించారు. ప్రస్తుతం ఈ పథకం టెండర్ దశలో ఉంది. ప్రక్రియ పూర్తయితే త్వరలో పనులు మొదలవుతాయి. – వినోద్, మిషన్ భగీరథ ఏఈ, నాగర్‌కర్నూల్

# 36 మద్యం దుకాణాలకు దరఖాస్తులు

- ఎస్సీ రిజర్వుడు 6.. గౌడ కులస్తులకు 5 దుకాణాల కేటాయింపు
- 25 జనరల్ కేటగిరీకి..
- వివరాలు వెల్లడించిన ఈఎస్ సైదులు



వివరాలు వెల్లడిస్తున్న ఈఎస్ సైదులు

గద్వాల క్రైం: నూతన మద్యం దుకాణాల కేటాయింపు కోసం ప్రభుత్వం టెండర్లు ప్రకటించిందని జిల్లా ఎక్సైజ్ సూపరిండెంట్ సైదులు అన్నారు. శుక్రవారం జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లాలోని 36 మద్యం దుకాణాలలో ఎస్సీ రిజర్వు ఆరు, గౌడ కులస్తులకు అయిదు, 25 మద్యం దుకాణాలకు జనరల్ కేటాగిరీకి కేటాయించారన్నారు. 2023 – 2025 వరకు ఈ దుకాణాల కాలపరిమితి ఉంటుందని అన్నారు. టెండర్లలో పాల్గొరాల్సిన వారు ఏదైనా బ్యాంకులో రూ. 2లక్షల డీడీ, చలాన్ గద్వాల ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయం పేరిట తీయాలని, ఈ నెల 18వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు దరఖాస్తులు జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో అందజేయలన్నారు. ఎస్సీ రిజర్వుడు దుకాణాలు గద్వాల షాపు నంబర్ 8, గట్టు బల్గెర షాపు 20, మల్దకల్ షాపు 16, కోటీదొడ్డి 21 అని, గౌడ కులస్తుల దుకాణాలు అయిజ షాపు నంబర్ 12, 14, మల్దకల్ 15, అలంపూర్ పరిధిలోని షాపు నంబర్ 4, రాజోళి 2 షాపులు అని పేర్కొన్నారు. రిజర్వ్ దుకాణాలకు రాష్ట్రానికి చెందిన వారు, మిగతా వాటికి భారత పౌరుడై ఉండాలన్నారు.

**గతంలో 1,041 దరఖాస్తులు.. రూ.20కోట్ల ఆదాయం**

గతంలో 2021 – 2023 మద్యం పాలసీలో జిల్లాకు 1041 దరఖాస్తులు వచ్చాయని, డీడీల రూపంలో రూ. 20.82 కోట్ల ఆదాయం సమకూరిందన్నారు. నూతన పాలసీ దరఖాస్తుల స్వీకరణలో అంతకంటే ఎక్కువ ఆదాయం వస్తుందని ఈఎస్ ఆశాభావం వ్యక్తం చేశారు. దుకాణాల కేటాయింపు కలెక్టర్ సమక్షంలో లక్కీడీప్ ద్వారా నిర్వహించనున్నామని, దుకాణాలు దక్కించుకున్న వారు అదే రోజు ఆరోవంతు నగదు చెల్లించాలన్నారు. 4వ తేది నుంచే దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, మొదటి రోజు కావడంతో ఎవరు దరఖాస్తులు చేసుకోలేదన్నారు. సమావేశంలో సీఐలు గోపాల్, బానోవత్ పటేల్, హనుమనాయక్ తదితరులు ఉన్నారు.

# కొత్తగా జూనియర్ అసిస్టెంట్లు

- సూపర్‌న్యూమరీ పోస్టులు సృష్టించనున్న ప్రభుత్వం
- రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ శాఖల్లో నోటిఫై చేయాలని ఆర్థిక శాఖ ఉత్తర్వులు
- ఉమ్మడి జిల్లాలో పెరగనున్న జూనియర్ అసిస్టెంట్, తత్సమాన పోస్టులు

సాక్షి, నాగర్‌కర్నూల్: రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ శాఖల్లో కొత్తగా జూనియర్ అసిస్టెంట్, వార్డు ఆఫీసర్, రికార్డు అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్, లస్కర్, హెల్పర్ పోస్టులను సూపర్ న్యూమరరీ విధానంలో సృష్టిస్తూ వాటిని ఆయా శాఖల్లో నోటిఫై చేయాలని ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలోని కొత్త జిల్లాల వారీగా రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ శాఖల్లో ఆయా పోస్టుల సంఖ్య పెరగనుంది. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో వీటిని ప్రభుత్వం భర్తీ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అలాగే రెవెన్యూ శాఖలో 61 ఏళ్లలోపు ఉన్న వీఆర్‌ఏలను వివిధ శాఖలకు కేటాయించనున్నారు. 61 ఏళ్లు దాటిన వీఆర్‌ఏలకు వారి కొడుకు లేదా కూతుళ్లకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.

**జిల్లాల వారీగా పెరగనున్న పోస్టులు ఇలా..**

| జిల్లా | రెవెన్యూ (జూనియర్ అసిస్టెంట్) | మున్సిపల్ (వార్డ్ ఆఫీసర్) | రెవెన్యూ (రికార్డు అసిస్టెంట్) | రెవెన్యూ (ఆఫీస్ సబార్డినేట్) | ఇరిగేషన్ (లస్కర్/ హెల్పర్) | మిషన్ భగీరథ (హెల్పర్) |
|---|---|---|---|---|---|---|
| మహబూబ్‌నగర్ | 67 | 14 | 77 | 44 | 110 | 96 |
| నాగర్‌కర్నూల్ | 79 | 51 | 40 | 3 | 163 | 120 |
| వనపర్తి | 54 | 31 | 43 | 6 | 110 | 84 |
| జో.గద్వాల | 49 | 29 | 55 | 28 | 101 | 72 |
| నారాయణపేట | 55 | 37 | 78 | 51 | 133 | 78 |

### సంక్షోభంలో పెట్టుబడిదారి విధానం

గద్వాల అర్బన్: ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడిదారి విధానం తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వేస్లీ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆపార్టీ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సోషలిస్టు దేశాలలో మాత్రం ప్రభుత్వ రంగాలను బలోపేతం చేసి సామాజిక, ఆర్థిక అసమానతలను తగ్గించాయని తెలిపారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కేంద్రంలోని బిజేపీ ప్రభుత్వం వివిధ వర్గాల వైషమ్యాలు సృష్టిస్తుందని, మణిపూర్, హర్యానా రాష్ట్రాల్లో జరుగుతున్న ఘర్షణలకు ప్రభుత్వ విధానాలే కారణమని ఆరోపించారు. పార్లమెంట్ ఉభయసభల్లో మణిపూర్ అంశంపై చర్చలేకుండా ప్రజలకు సంబంధించిన బిల్లులను ఆమోదించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. రాష్ట్రంలో అర్హులైన పేదలందరికి డబుల్‌బెడ్రూం ఇండ్లు ఇవ్వాలని పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో డబుల్ బెడ్రూం ఇళ్లకు దరఖాస్తులు స్వీకరించి ఎందుకు లబ్ధిదారులకు పంపిణీ చేయలేదని ప్రశ్నించారు. అదేవిధంగా ఆకాల వర్షాలతో ఇళ్లు కోల్పోయిన, పంట నష్టపోయిన వారికి పరిహారం ఇవ్వాలన్నారు. వెంకటరమణ, వెంకటస్వామి, వివి నర్సింహ్మ, దేవదాసు, రాజు పాల్గొన్నారు.

# సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



మారమునగాలలో రైతుల నుంచి రైతు బీమా దరఖాస్తును స్వీకరిస్తున్న ఏడీఏ సక్రియానాయక్

అలంపూర్: పత్తి, మిరప, కంది పంటలలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏడీఏ సక్రియానాయక్ తెలిపారు. శుక్రవారం ఆయన ఉండవెల్లి క్లస్టర్ పరిధిలోని మారమునగాల, శేరుపల్లి, ప్రాగటూరు తదితర గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంటలలో అంతర్ కృషి చేసి కలుపు నివారించుకోవాలని, ఎకరానికి 20 కిలోల యూరియా, 15 కిలోల సూపర్ సూపర్, 10 కిలోల పోటాష్ మిశ్రమం కలిగిన ఎరువులను మొక్కల మొదల వద్ద చల్లి అంతర్ కృషి చేయాలని సూచించారు. అంతర్ కృషితో పంట సాగులో మంచి దిగుబడి సాధించడానికి అవకాశం ఉంటుందని వివరించారు.

**'రైతు బీమా'కు 1840 మంది దూరం**

నియోజకవర్గంలోని రైతులు రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. అలంపూర్ వ్యవసాయ డివిజన్ పరిధిలోని ఇటిక్యాల మండలం 277 మంది, మానవపాడులో 189 ఉండవెల్లిలో 215, అలంపూర్‌లో 248, వడ్డేపల్లిలో 151, రాజోలిలో 215, అయిజ మండలంలో 545 మంది రైతులు రైతు బీమా పథకం కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉందని తెలిపారు. వీరితోపాటు కొత్తగా ఎవరైనా కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని, ఈ నెల 5 చివరి తేదీగా పేర్కొన్నారు. దరఖాస్తు ఫారాలను మీ సమీప రైతు వేదికల్లో ఇవ్వాలన్నారు. అనంతరం రైతుల నుంచి రైతు బీమా దరఖాస్తులను స్వీకరించారు.

# రైతు సేవే పరమావధిగా..



టైరోడ్డులో రైతు సంఘం కార్యాలయం ప్రారంభించిన సంఘం నాయకులు(ఫైల్)

- కృష్ణ, మాగనూరు మండలాల రైతులతో సంఘం ఏర్పాటు
- త్వరలో జిల్లా, రాష్ట్ర స్థాయికి విస్తరించనున్నట్లు వెల్లడి..
- టైరోడ్డులో రైతు సంఘం కార్యాలయం ప్రారంభం

కృష్ణా: ప్రతి వృత్తికీ, కులానికీ, ఏ పని చేసే వారైనా సంఘాలు ఏర్పాటు చేసుకొని వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకుంటున్నారు. సమాజంలో యూనిటీ అంటూ లేనిది కేవలం రైతులకు మాత్రమే. అందుకే రైతులు అడుగడుగునా నష్టంతో మోసపోతున్నారు. ఇలాంటి పరిస్థితి రైతులకు భవిష్యత్‌లో ఏర్పడకుండా వారికి భరోసా కల్పించి అండగా ఉండేందుకు పార్టీలకు, నాయకులకు అతీతంగా రైతు సంఘం ఏర్పాటు చేసి టైరోడ్ వద్ద రైతుసంఘం కార్యాలయం ప్రారంభించారు. మొదట ఉమ్మడి మాగనూర్, కృష్ణా మండలాల రైతులతో అడహక్ కమిటీ ఏర్పాటు చేశారు. ప్రతి గ్రామంలోనూ రైతు సంఘాలను ఏర్పాటు చేసి అనంతరం జిల్లా, రాష్ట్ర స్థాయిలో రైతు సంఘాలను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

**రైతు సమస్యల పరిష్కారమే..**

కృష్ణా మండలం సరిహద్దుగా ఉండడంతో ఈ ప్రాంత రైతులు కర్ణాటకలోని రాయచూర్ మార్కెట్‌పై ఆధారపడుతున్నారు. కర్ణాటకకు చెందిన వ్యాపారవేత్తలు సైతం కృష్ణా మండల ప్రాంతంలో భూములు కొనుగోలు చేసి వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. నదీతీర ప్రాంతంలో ఆంధ్ర రైతులు అధికంగా ఉన్నారు. వీరిలో చాలా మందికి సొంత పొలాలు లేవు. కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తుంటారు. నిత్యం అటు కర్ణాటకతోనూ, ఇటు తెలంగాణతోనూ సమిష్టిగా కార్యకలాపాలు నిర్వహిస్తుంటారు. ఈ ప్రాంత రైతులకు ధాన్యం కొనుగోలు, పంట సామగ్రి, కూలీలు, కౌలు రేట్లు తదితర సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పటికప్పుడు సమస్యల పరిష్కారం కోసం రైతు సంఘం కృషి చేస్తుందని పేర్కొన్నారు.

**కర్ణాటక తరహాలో..**

సరిహద్దులో ఉన్న కర్ణాటకలో స్వచ్ఛందంగా పార్టీలకు అతీతంగా రైతు సంఘాలున్నాయి. రైతు సమస్యలేవైనా ఆ సంఘాల అధ్వర్యంలోనే పరిష్కరించుకుంటారు. ప్రభుత్వానికి, రైతులకు అనుసంధానంగా అక్కడి సంఘాలు పని చేస్తాయి. అదే విధంగా రైతులకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటూ రైతుల అభివృద్ధికి ఈ సంఘం ఏర్పాటు చేసుకున్నట్లు రైతులు పేర్కొన్నారు.

### రైతుకు అండగా..



రైతులకు కష్టాలొచ్చినప్పుడు వారికి అండగా ఉంటూ వారి సమస్యలను పరిష్కరించడానికి మా రైతు సంఘం స్వచ్ఛందంగా పని చేస్తుంది. ప్రభుత్వం నుంచి రైతులకొచ్చే సౌకర్యాలతో పాటూ వ్యవసాయశాఖ, ఉపాధి హామీ పథకం, ఉద్యాన శాఖల వారు అందించే సౌకర్యాలను అధికారుల నుంచి తెలుసుకొని రైతులకు చేరవేయడమే మా రైతు సంఘం ప్రధాన ఉద్దేశం. గిట్టుబాటు ధర, నష్ట పరిహారం, ప్రతి విషయంలోనూ మా రైతు సంఘం పని చేస్తుంది. ప్రస్తుతం ఉమ్మడి మండలాల్లో కమిటీలు వేస్తున్నాం. త్వరలోనే జిల్లా, రాష్ట్ర స్థాయిలో కమిటీలు వేస్తాం.

– నాగేశ్వరరావు, రైతు సంఘం గౌరవ అధ్యక్షుడు

### రాజకీయాలకు అతీతంగా..



మండలంలో నెల రోజుల నుంచి అన్ని గ్రామాల్లో రైతు కమిటీలు వేయడం శుభ పరిణామం. ఇందులో రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా పని చేయాలి. అప్పుడే రైతు సమస్యలు పరిష్కారం అవుతాయి. రాబోయే రోజుల్లో అదే విధంగా కొనసాగాలి.

– రాఘప్ప, ముడుమాల్ రైతు

### సంఘం ఉండడం ఆనందం



చాలా రోజులుగా రైతులకు అండగా ఒక సంఘం ఉండాలని కోరుకున్నాం. ఇప్పుడు ప్రజల్లో మార్పు వచ్చింది. రైతుల్లో చదువుకున్న వారు ఉన్నారు. ప్రస్తుత టెక్నాలజీకి అనుగుణంగా రైతులు మారాలి. అందుకు సరైన వేదిక ఉండాలి. ఇప్పుడు ఉన్న ప్రభుత్వం కూడా రైతులకు చాలా ఉపయోగకరమైన పథకాలు అమలు చేస్తున్నది. కాని అవి గ్రామీణ స్థాయిలో రైతులకు చేరడం లేదు. రైతులకు సమాచారం అందించి వారి సమస్యలు పరిష్కారం కోసం సంఘం ఏర్పడడం ఆనందంగా ఉంది.

– రాఘవేంద్రగౌడ్, ముడుమాల్ రైతు

## క్లుప్తంగా

### రైలు ఢీకొని వ్యక్తి మృతి

గద్వాల క్రైం: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం పీజేపీ కుడి కాలువ రైల్వేబ్రిడ్జి వద్ద చోటుచేసుకుంది. రైల్వే హేడ్ కానిస్టేబుల్ రామకృష్ణ కథనం ప్రకారం.. శుక్రవారం మధ్యాహ్నం గద్వాల–హైదరాబాద్ వేళ్లే రైలు మార్గంలో పట్టణ శివారులోని పీజేపీ కుడి కాలువ రైల్వే బ్రిడ్జి వద్ద ప్రమాదవశాత్తు గుర్తు తెలియని గుర్తు తెలియని వ్యక్తి (45) రైలు ఢీకొని మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి రైల్వే పోలీసులు వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి బంధువులు ఎవరైనా ఉంటే రైల్వే పోలీసులను సంప్రదించాలని తెలిపారు.

### ఉరేసుకొని వ్యక్తి బలవన్మరణం

కల్వకుర్తి టౌన్: ఆస్పత్రుల చుట్టూ ఎంత తిరిగినా వ్యాధి నయం కాకపోవడంతో విసుగుతో ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం ఎల్లికల్‌లో చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ హన్మంత్‌రెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని ఎల్లికల్‌కు చెందిన తిరుపతయ్య (50) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఉన్నాడు. వైద్యం కోసం చాలా ఆస్పత్రులు తిరిగినా నయం కాకపోవడంతో విసుగు చెందాడు. శుక్రవారం ఉదయం పొలం దగ్గరకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయటకొచ్చాడు. పొలానికి వెళ్తూ మార్గమధ్యలో చెట్టుకు తన ఒంటిపై ఉన్న లుంగీతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అటువైపు వెళ్తున్న గ్రామస్తులు చూసి వెంటనే కుటుంబసభ్యులకు చెప్పారు. ఈ విషయం పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

### 4రోజుల తర్వాత అంత్యక్రియలు

పెద్దకొత్తపల్లి: దేదినేనిపల్లికి చెందిన బోడమోని కాశన్న ఈ నెల 1వ తేదీన హత్యకు గురయ్యాడు. నిందితులను అరెస్టు చేసే వరకు మృతదేహాన్ని ఖననం చేయబోమని నాలుగు రోజులుగా కుటుంబసభ్యులు, బంధువులు భీష్మించుకూర్చున్నారు. దీంతో శుక్రవారం నిందితుడు శారద లోకేష్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం కాశన్న మృతదేహాన్ని కుటుంబసభ్యులు ఖననం చేశారు. ఈ ఘటనపై విచారణ కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు.

### నిందితులకు 14రోజుల రిమాండ్



ఆత్మకూర్: పట్టపగలు ఇంట్లో చోరీకి పాల్పడిన నిందితులకు ఆత్మకూర్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి శిరీష 14 రోజులు రిమాండ్ విధించారు. ఈ సందర్భంగా సీఐ కార్యాలయంలో సీఐ కేఎస్ రత్నం విలేకరులకు వివరాలు వెల్లడించారు. అమరచింత మండలంలోని మస్తీపూర్ ఎరుకలి చిన బాలకొండన్న ఈనెల 2న ఇంటికి తాళం వేసి భార్యాపిల్లలతో వనపర్తిలోని ఆస్పత్రికి వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దొంగలు పట్టపగలే తాళం పగులగొట్టి ఇంట్లోని రూ.4.50 లక్షల నగదు ఎత్తుకెళ్లారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు క్లూస్ టీంతో వచ్చి వివరాలు సేకరించి గాలింపు చర్యలు చేపట్టారు. ఆత్మకూర్ శివారులో శుక్రవారం మరో చోరీకి పాల్పడేందుకు వెళ్తూ పోలీసులకు పట్టుబడ్డారు. పట్టుబడిన జడ్చర్లకు చెందిన బొంతల మూర్తి, అరుణ్‌కుమార్‌లను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.2.10 లక్షల నగదు, ఒక బైక్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీరితో పాటు ఉన్న మరో దొంగ పరారీలో ఉన్నాడు. పట్టుబడిన వారిని కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు. దీంతో వారిని జిల్లా జైలుకు తరలించారు. పరారీలో ఉన్న మరో నిందితున్ని త్వరలోనే పట్టుకుంటామని సీఐ తెలిపారు.

### ల్యాబ్‌లపై ఆకస్మిక తనిఖీ

కొల్లాపూర్ రూరల్: మండలంలోని సింగోటంలో ఉన్న కేర్ ల్యాబ్‌పై వైద్యాధికారులు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. సింగోటంలో హెల్త్ కేర్ ల్యాబ్‌ను అర్హత లేకున్న నడుపుతున్నట్లు సమాచారం రావడంతో తనిఖీ చేసినట్లు అధికారులు తెలిపారు. ల్యాబ్ నిర్వహించడానికి ఎలాంటి అనుమతులు లేవన్నారు. ప్రజల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలిపారు. ఆధారాలతో ల్యాబ్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు. కొల్లాపూర్ పట్టణంలో ల్యాబ్‌లను తనిఖీ చేసి, కొన్నింటిని సీజ్ చేసినట్లు తెలిపారు. తనిఖీలో మండల వైద్యశాఖ అధికారి చంద్రశేఖర్, రామ్మోహన్, కిషోర్ ఉన్నారు.



# కాన్పుల్లో కల్వకుర్తి నంబర్ వన్

- వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్



జూమ్‌మీటింగ్‌లో పాల్గొన్న ఆస్పత్రి వైద్యులు

కల్వకుర్తి టౌన్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేస్తున్న సాధారణ ప్రసవాల్లో కల్వకుర్తి కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)లో ఆరునెలలుగా ముందు వరుసలో ఉందని తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ ప్రశంసించారు. శుక్రవారం పట్టణంలోని సీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన జూమ్‌మీటింగ్‌కు ఆస్పత్రి వైద్యులు హాజరయ్యారు. ఈసందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ సీహెచ్‌సీలో జూలై నెలలోనే 148 కాన్పులు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ఆస్పత్రికి కండ్ల కలక కేసులు పెరుగుతున్నాయని, వాటికి సరిపడా మందులను స్టోర్‌లో అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య పెరుగుతుండడంతో మరో గైనకాలజిస్టు, అనిస్థీషియా వైద్యుడు అవసరముందని వైద్యులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రసవాలలో ప్రతి నెల ముందు వరుసలో ఉంచుతున్న గైనకాలజిస్టు విజయ్‌కుమార్‌ను కమిషనర్ అభినందించారు. జూమ్‌మీటింగ్ అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్ శివరాం సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రోగుల నుంచి ఎవరైనా డబ్బులు ఆశిస్తే వారిపై కఠిన చర్యలుంటాయని సిబ్బందిని హెచ్చరించారు. సమావేశంలో వైద్యులు స్వర్ణలత, యశోధాబాయి, విజయ్‌కుమార్, పాండురంగ, నర్సింగ్ సూపరింటెండెంట్ ప్రభావతి పాల్గొన్నారు.

# క్రీడల్లో బాలికలను ప్రోత్సహించడమే లక్ష్యం

- ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ



విజేతలతో ఆర్డీటీ నిర్వాహకులు

లింగాల: గ్రామీణ ప్రాంతాల బాలికలను క్రీడల్లో ప్రోత్సహించడమే తమ లక్ష్యమని ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర గురుకుల పాఠశాల, కళాశాల క్రీడామైదానంలో ఆర్డీటీ ఆధ్వర్యంలో బాలికల అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సాయికృష్ణ క్రీడలను ప్రారంభించి మాట్లాడారు. అండర్–14లో బాలికలను అథ్లెటిక్స్‌లో రాణించడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. బాలికలు పోటీతత్వం ప్రదర్శించడం చాలా బాగుందన్నారు. ఈ పోటీల్లో ఆర్డీటీ ఏరియా పరిధిలోని లింగాల, బల్మూర్, పెద్దకొత్తపల్లి, కొల్లాపూర్ మండలాల ప్రభుత్వ పాఠశాలల నుంచి 114 మంది బాలికలు వచ్చి క్రీడానైపుణ్యాన్ని ప్రదర్శించినట్లు ఏరియా టీం లీడర్ రాధ తెలిపారు. 100, 200, 400 మీటర్ల పరుగుతో పాటు షార్ట్‌పుట్, లాంగ్‌జంప్ ఈవెంట్స్‌ను నిర్వహించినట్లు ఆమె తెలిపారు. ప్రతి ఈవెంట్‌లోనూ ప్రథమంగా నిలిచిన వారిని ఈ నెల 26 నుంచి అనంతపురంతో జరిగే జిల్లా స్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వంశీకృష్ణ, ఓబులేష్, ప్రిన్స్‌పాల్ వినోద్‌ఖన్నా, పీడీ వెంకటేశ్వర్లు, రాజురాథోడ్, పీఈటీలు పాల్గొన్నారు.

# సరైన జాగ్రత్తలు..పంటలకు మేలు

- జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్



రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేష్

జడ్చర్ల టౌన్: వర్షాలు కురవడంతో సరైన జాగ్రత్తలు తీసుకుంటే పంటకు మేలు కలుగుతుందని జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్ రైతులు, రైతు కూలీలకు అవగాహన కల్పించారు. శుక్రవారం ఆయన మండలంలోని కోడ్గల్, పెద్దఆదిరాల గ్రామాల్లో పంటలను పరిశీలించారు. వర్షాధార పంటలైన పత్తి, కంది, మొక్కజొన్నలో మురికి నీరు తీసేయాలన్నారు. వర్షాకాలంలో వేసే పలు రకాల పంటలపై రైతులు తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు.

**కంది రైతులకు జాగ్రత్తలు**

- స్వల్పకాలిక కంది రకాలు (130–150రోజులు) వెంటనే విత్తుకోవాలి.
- కందిని ఏకపంటగా, మొక్కజొన్న, పెసలు, మినుములలో అంతరపంటగా వేసుకోవచ్చు.

**పత్తిపంట రైతులకు..**

పత్తి రైతులు ఎకరాకు 25కిలోల యూరియా, 20 కిలోల పొటాష్‌ను చల్లుకోవాలి.

- పంట కోలుకోవడానికి 10గ్రాములు పాలిఫిడ్ 19:19:19, మల్టీ కె 130–45లలో ఏదైనా ఒకటి లీటరు నీటిలో కలిపి వారం రోజుల్లో 2సార్లు పిచికారీ చేసుకోవాలి.
- రసం పీల్చే పురుగుల ఉధృతి తక్కువ ఉంటే మోనోక్రోటోఫాస్ నీరు 1:4 కలిపి 30రోజులు, 45 రోజుల పంట దశలో కాండం మీదపూత పూయాలి.

**మొక్కజొన్న రైతులకు..**

- లేత దశలో మొక్కజొన్న చాలాసున్నితం.
- అధికనీటిని తట్టుకోలేదు. పొలం నుంచి మురుగునీటిని వెంటనే తీసేయాలి.
- అధిక వర్షాల వల్ల నేలలో భాస్వరం లోపం ఏర్పడి మొక్కలన్నీ ఊదారంగులోకి మారే అవకాశం ఉంది.
- 19–19–1910గ్రాములు, డీఏపీ మందును లీటరు నీటిలో కలిపి మొక్కలపై పిచికారీ చేయాలి.
- రైతులు పంట విత్తిన 15రోజుల్లో కత్తెర పురుగు నివారణ చర్యలు చేసుకోవాలి.

**వరి పంట రైతులకు..**

- వరి పంటకు నీటి వసతి ఉన్న రైతులు స్వల్పకాలిక రకాల నారుమళ్లు పోసుకోవాలి.
- పొలం గట్లు శుభ్రంగా ఉంచుకోవాలి, లేదంటే అగ్గితెగులు సోకే అవకాశం ఉంది.
- అగ్గితెగులు నివారణకు ట్రైసోకజోల్ మాంకోజెబ్ 2.5 గ్రాములు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.
- కాండం తొలిచే పురుగు కనిపిస్తే నివారణకు కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు, క్లోరాంట్రానిపోల్ గుళికలు చల్లుకోవాలి.
- ముదురు నారుమళ్లు వేసుకునే రైతులు 25శాతం అధికంగా నత్రజని వేసి దుబ్బుకు 4, 5 మొక్కలు దగ్గర దగ్గరగా నాటుకోవాలి.
- నారుకొనలు తుంచి నాటుకుంటే కాండం తొలిచే పురుగును నాశనం చేయవచ్చు.

### రేపు జిల్లా ఫుట్‌బాల్ పురుషుల జట్టు ఎంపిక

స్టేషన్ మహబూబ్‌నగర్: వనపర్తిలో ఈ నెల 16 నుంచి 19 వరకు జరిగే రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల ఫుట్‌బాల్ టోర్నీలో పాల్గొనే జిల్లా జట్టు ఎంపికలను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో ఈనెల 6న ఉదయం 8 గంటలకు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి గజానంద్ కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికల్లో వనపర్తి జిల్లా మినహా ఉమ్మడి జిల్లా క్రీడాకారులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. క్రీడాకారులు ఒరిజనల్ ఆధార్ కార్డుతో ఎంపికలకు హాజరు కావాలని, మిగతా వివరాల కోసం 94407 65228, 93964 39663 నంబర్లను సంప్రదించాలని కోరారు.

### నలుగురికి రిమాండ్

చారకొండ: కొంత కాలంగా కల్వకుర్తి, చారకొండ ప్రాంతాల్లో వరుసగా డీజిల్ చోరీకి పాల్పడుతున్న నలుగురు వ్యక్తులను చారకొండ ఎస్‌ఐ, పోలీసులు శుక్రవారం పట్టుకున్నట్లు వెల్దండ సీఐ సోమనర్సయ్య తెలిపారు. దొంగతనాలకు పాల్పడిన వారు మహబూబ్‌నగర్ జిల్లా ఓబ్లాయిపల్లికి చెందిన రామావత్ జాని, ఏనుకొండలో లక్ష్మీనాయక్ తండాకు చెందిన కేతావత్ రవీందర్, ఇస్లావత్ శ్రీనివాస్‌లుగా గుర్తించారు. వారి నుంచి 200 లీటర్ల డీజిల్, రూ.10 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి కల్వకుర్తి కోర్టుకు తరలించగా వారికి రిమాండ్ విధించినట్లు వెల్దండ సీఐ తెలిపారు. చాకచక్యంగా వ్యవహరించి దొంగలను పట్టుకున్న చారకొండ ఎస్‌ఐ రవి, పోలీస్ కానిస్టేబుల్ వెంకట్‌రెడ్డి, అరుణాచలం, హరిలాల్, భీముడు, ఆంజనేయులును కల్వకుర్తి డీఎస్పీ పార్థసారథి అభినందించినట్లు పేర్కొన్నారు.

# 20 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



భూత్పూర్: అక్రమంగా తరలిస్తున్న 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకొని కేసు నమోదు చేసిన ఘటన శుక్రవారం భూత్పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాసులు కథనం ప్రకారం.. ఖిల్లాగణపురం మండలం ఎన్కితండాకు చెందిన మహేష్, మహబూబ్‌నగర్ మండలం జమిస్తాపూర్ నుంచి బిజినేపల్లికి 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని వాహనంలో తరలిస్తున్నాడు. ఈ క్రమంలో భూత్పూర్ చౌరస్తాలో పోలీసులు తనిఖీ చేసి వాహనాన్ని పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీసులు జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బాలప్రసాద్, యూసుఫ్ అలీలు అక్కడికి చేరుకొని వాహనంలో రేషన్ బియ్యంగా గుర్తించారు. దీంతో అధికారుల ఫిర్యాదు మేరకు మహేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

### వ్యక్తికి 6నెలల జైలు శిక్ష

కోయిల్‌కొండ: మండలంలోని అభంగపట్నం గ్రామానికి చెందిన ఎర్రబాలకిష్టయ్య 2018లో గ్రామంలో ఓ వ్యక్తిపై గొడవపడి దాడి చేశాడు. దీంతో శుక్రవారం జిల్లా కోర్టు జడ్జి హరిశ్‌కుమార్ ఎర్రబాలకిష్టయ్యకు ఆరునెలల జైలుశిక్ష, రూ.1000 జరిమానా విధించినట్లు ఎస్‌ఐ విజయ్‌భాస్కర్ తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో ఎస్‌ఐ జములప్ప, హెడ్‌కానిస్టేబుల్ యాదగిరిలు ఉన్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

# వైద్యం కోసం ఆదివాసి మహిళ ఆవేదన!

- భారీగా ఉబ్బిన కడుపు
- ఊపిరి తీసుకునేందుకు అల్లాడుతున్న వైనం



ఉబ్బిన కడుపుతో ఈదమ్మ

అమ్రాబాద్: ఆదివాసి మహిళకు కడుపులో పెరుగుతున్న బరువు ప్రాణాల మీదకు తెచ్చింది. ఎలాగైనా వైద్యం అందించి ఆదుకోవాలని ఆమె వేడుకుంటుంది. అమ్రాబాద్ మండలం లక్ష్మాపూర్(బీకే) గ్రామానికి చెందిన ఈదమ్మ, భర్త బిక్షమయ్య నిరుపేద కుటుంబం. వారికి ముగ్గురు ఆడపిల్లలు, జీవాలు మేపుతూ జీవనం గడుపుతున్నారు. ఇంతలోనే ఈదమ్మ కడుపులో ఏదో పెరుగుతుంది. క్రమంగా 15 కిలోల బరువు వరకు వచ్చింది. వారికి ఉన్న స్తోమతలో ఆర్‌ఎంపీల వద్ద చూయించుకున్నా తగ్గలేదు. కడుపులో కణితి పెరుగుతుందని ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యులు తెలిపారని ఈదమ్మ బోరుమంటుంది. ఆపరేషన్ చేయించుకునే స్తోమతలేక అలాగే ఉన్నామని క్రమంగా బరువు పెరుగుతుండటంతో శ్వాసతీసుకోవడం కష్టం అవుతుందని ఈదమ్మ విలపిస్తోంది. తనకేమన్న అయితే పిల్లలు అనాథలు అవుతారని, ప్రభుత్వం వైద్యం అందించి ఆదుకోవాలని వేడుకుంటుంది.

# కార్మికుల సంక్షేమాన్ని విస్మరించారు

- ఈనెల 9న జిల్లాకేంద్రాల్లో, 10 నియోజకవర్గాల్లో ధర్నాలు
- ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘు



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘు

స్టేషన్ మహబూబ్‌నగర్: కార్మికుల సంక్షేమాన్ని కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం విస్మరించాయని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘు అన్నారు. జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ పబ్లిక్ సెక్టారులను తీసుకొస్తే కేంద్ర ప్రభుత్వం ప్రైవేట్ కంపెనీలకు అమ్మే ప్రయత్నం చేస్తుందన్నారు. చివరకు క్రీడా మైదానాలను ప్రైవేట్‌కు అప్పజెప్పడం సిగ్గుచేటన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు దేశ ఆర్థిక వ్యవస్థకు గొడ్డలిపెట్టుగా మారుతున్నాయన్నారు. అనేక త్యాగాలు, ఉద్యమాలతో పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్‌లుగా మారుస్తూ పార్లమెంట్‌లో చట్టం చేసిందన్నారు. వేతనాల కోడ్ చట్టంతో కనీస వేతనాలను నిర్ణయించే మౌలిక విధానానికి స్వస్తి పలికారని అన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేస్తానని, ఉద్యోగాలను రెగ్యులర్ చేస్తానని సీఎం కేసీఆర్ మాట ఇచ్చి విస్మరించారన్నారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఐఎన్‌టీయూసీ, దేశంలోని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 9వ తేదీన జిల్లా కేంద్రాల్లో, 10న అసెంబ్లీ నియోజకవర్గాల్లో ధర్నా కార్యక్రమాల్లో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రాములుయాదవ్, పట్టణ అధ్యక్షుడు బాబుమియా, చంద్రమౌళి, వినయ్, ఖాదర్, రవి, ఆంజనేయులు, విజయ్, శ్రీను, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను పరిశీలించిన కేంద్ర బృందం



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న బృందం

రాజాపూర్: స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్‌లో భాగంగా బాలానగర్ మండలంలోని వాయిల్‌కుంట పంచాయతీలో శుక్రవారం కేంద్ర బృందం సభ్యుడు లోకేష్ ఆధ్వర్యంలో రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ విభాగం సీఆర్‌డీ శ్రీదేవితో కలిసి చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. వ్యక్తిగత మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు, డ్రెయినేజీలు, సెగ్రిగేషన్ షెడ్, సీసీరోడ్లు, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. స్థానిక సర్పంచ్ గోపినాయక్, ఎంపీడీఓ కృష్ణారావు, స్వచ్ఛ భారత్ మిషన్ అధికారులు పవన్, రవి, ఏపీఓ రాజశేఖర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి బాసు తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ భూ దాహానికి పేదలు బలి



వల్లూరులో పర్యటిస్తున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

ఎర్రవల్లిచౌరస్తా: రాష్ట్రంలో కేసీఆర్ భూ దాహానికి పేదలు బలైపోతున్నారని, ఆయన పాలనలో ప్రజలకు గోసి గుడ్డ కూడా మిగిలే పరిస్థితి లేదని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. బీఎస్పీ ఆధ్వర్యంలో చేపట్టిన బహుజన రాజ్యాధికార పాదయాత్ర శుక్రవారం జోగుళాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలంలోని వల్లూరులో కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే గ్రామంలో ఎంత మందికి డబుల్ బెడ్‌రూం ఇళ్లు, మూడెకరాల భూమి ఇచ్చారో సమాధానం చెప్పాలన్నారు. ఎమ్మెల్యే తన సొంత గ్రామంలోనే అభివృద్ధి చేయకుంటే నియోజకవర్గాన్ని ఎలా అభివృద్ధి చేస్తారని ప్రశ్నించారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో 30 వేల ఎకరాల పేదల అసైన్డ్ భూములను బలవంతంగా లాక్కొని అపర కుబేరులకు ధారాదత్తం చేయడం దుర్మార్గమన్నారు. పదేళ్ల పాలనలో కేసీఆర్‌కు భూదాహం తీరలేదని.. పేద రైతుల నోట్లో ప్రభుత్వం ఇలా మట్టికొడుతుందని విమర్శించారు. బీఎస్పీ అధికారంలోకి వచ్చిన వెంటనే కేసీఆర్, కేటీఆర్ అక్రమ ఫాంహౌస్ విల్లాలను స్వాధీనం చేసుకొని పేదలకు రాజ్యాంగబద్ధంగా పంచుతామని హామీ ఇచ్చారు. జనాభాలో 99 శాతం ఉన్న బహుజనులకే రాజ్యాధికారం దక్కాలనేది తమ పార్టీ లక్ష్యం అని, దీనికి ప్రజలంతా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కేశవరావు, జిల్లా ఇన్‌చార్జ్ కృష్ణ, నాయకులు శారదమ్మ, నాగజ్యోతి, శోభారాణిగౌడ్, తిరుపాల్, యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

**క్లుప్తంగా...**

## కౌంటరు వేయకపోతే జరిమానా తప్పదు

**ఉమ్మడి ఆస్తుల విభజనకేసులో కేంద్రానికి సుప్రీంకోర్టు హెచ్చరిక**



సాక్షి, న్యూఢిల్లీ : తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ఉమ్మడి ఆస్తుల విభజన కేసులో కౌంటరు దాఖలు చేయకుంటే జరిమానా తప్పదని కేంద్రాన్ని సుప్రీంకోర్టు హెచ్చరించింది. ఇరురాష్ట్రాల మధ్య ఉమ్మడి ఆస్తుల విభజన జాప్యంపై ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎస్‌వీ.భట్టిలతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారించింది. ఉమ్మడి ఆస్తుల విభజనకు జస్టిస్ రామసుబ్రమణియన్‌ను మధ్యవర్తిగా నియమించాలని ఏపీ తరపు ఏఓఆర్ మెహ్‌ఫూజ్ నజ్కీ కోరారు. దీనికి తెలంగాణ తరపు న్యాయవాది వైద్యనాథన్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సమయంలో కేంద్రం కౌంటరు దాఖలు చేయని విషయం ధర్మాసనం దృష్టికి రాగా, గతంలో 4 వారాల గడువు ఇచ్చినా ఇప్పటికీ దాఖలు చేయలేదా అని ప్రశ్నించింది. 3 వారాల్లోగా కౌంటరు దాఖలు చేయాలని లేకుంటే జరిమానా విధిస్తామని కేంద్రం తరపు న్యాయవాదికి తెలిపింది. కేంద్రం కౌంటరుపై రిజాయిండరు దాఖలుకు మరో మూడు వారాలు గడువిస్తూ... తదుపరి విచారణ అక్టోబరుకు వాయిదా వేసింది.

## వైద్యారోగ్యశాఖలో 'రెవెన్యూ' పెత్తనం సహించం

**తెలంగాణ ప్రభుత్వవైద్యుల సంఘం**


సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వైద్యారోగ్య శాఖలో రెవెన్యూ అధికారుల పెత్తనాన్ని సహించేది లేదని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం స్పష్టం చేసింది. ఆర్డీవోలను పర్యవేక్షణ అధికారులుగా నియమించే యోచనను ప్రభుత్వం విరమించుకోవాలని శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేసింది. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసినట్లుగా వైద్యవిధాన పరిషత్‌లో పనిచేసే వైద్యులను, సిబ్బందిని ప్రభుత్వంలో విలీనం చేసి, ట్రెజరీ ద్వారా జీతాలు అందించాలని కోరింది. మెడికల్ కళాశాలలో పనిచేసే వైద్యులకు 2016 పీఆర్సీ వేతన బకాయిలు, రూరల్ మెడికల్ కళాశాలల్లోని బోధన వైద్యులకు రూరల్ అలవెన్సులు వెంటనే విడుదల చేయాలని కోరింది. హెల్త్ డైరెక్టర్ పరిధిలో నిర్ణీతకాల వ్యవధి ప్రమోషన్లను వెంటనే కలిపించాలని, సీనియారిటీ ప్రాతిపదికన జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారులను, డీసీహెచ్‌ఎస్‌లను 33 జిల్లాలకు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. తెలంగాణ ప్రభుత్వ వైద్యుల ప్రతినిధుల బృందం త్వరలో సమావేశమై కార్యాచరణ ప్రకటిస్తుందని తెలిపింది.

# వివేకా లేఖను పట్టించుకోరా?

## అన్ని గొడ్డలి వేట్లు పడ్డాక ఆయన లేఖ రాశారా?

### మెదడు బయటికి వచ్చాక కూడా రాయడం సాధ్యమేనా?

- ఈ విషయంపై వైద్యుల అభిప్రాయం తీసుకోవాలి కదా!
- ఇంత ముఖ్యమైన అంశాన్ని ఎందుకు విస్మరించారు?
- ఘటనా స్థలంలో వేలి ముద్రల సంగతి ఏమైంది?
- అక్కడున్న వారందరివీ కాకుండా కొత్త వేలి ముద్రలు ఎవరివి?
- నిందితులు ఆస్తి పత్రాల కోసం వెదికారన్నది వాస్తవం..
- అలాంటప్పుడు ఈ అంశంపై ఎందుకు దృష్టి పెట్టలేదు?
- అవగాహన లేకుండా గూగుల్ టేక్ అవుట్ అంటూ హడావుడి దేనికి?
- ఐపీడీఆర్ డేటా ద్వారా కాల్స్, మెసేజ్‌ల వివరాలన్నీ తెలియవు
- వివేకా హత్య కేసు దర్యాప్తు తీరుపై 'ద వైర్' విశ్లేషణాత్మక కథనం




సాక్షి, అమరావతి: వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో అత్యంత కీలకమైనదిగా భావిస్తున్న వివేకా లేఖపై సీబీఐ నిశితంగా దృష్టి సారించకపోవడం విస్మయ పరుస్తోందని ప్రముఖ జాతీయ వార్త వెబ్‌సైట్ 'ద వైర్' పేర్కొంది. 'డ్రైవర్ ప్రసాద్ తనపై తీవ్రంగా దాడిచేసినట్టు వివేకా పేర్కొన్నట్టు ఆ లేఖలో ఉంది. లేఖను వంట మనిషి లక్ష్మమ్మ కుమారుడు ప్రకాశ్ చూసి పీఏ కృష్ణా రెడ్డికి ఇచ్చాడు. ఆయన వెంటనే అంటే ఉదయం 6.29కి వివేకా అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డికి ఫోన్‌చేసి ఆ లేఖలోని సమాచారాన్ని చదివి వినిపించారు. తాము వచ్చే వరకు లేఖను గోప్యంగా ఉంచమని, ఎవ్వరికీ ఇవ్వొద్దని చెప్పారు. కాసేపటి తర్వాత అక్కడకు వచ్చిన సీఐ శంకరయ్యకు కూడా కృష్ణారెడ్డి ఆ లేఖ విషయం చెప్పలేదు. వివేకా కుమార్తె సునీత, అల్లుడు నర్రెడ్డి రాజశేఖరెడ్డి తదితరులు పులివెందులకు చేరుకున్నాక ఆ రోజు సాయంత్రం ఆ లేఖను వైఎస్సార్ జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్‌శర్మకు అప్పగించారు' అనే విషయాన్ని చార్జ్‌షీట్‌లో ప్రస్తావించడం మినహా ఇంత కీలకమైన విషయంపై సీబీఐ ఎందుకు లోతుగా దర్యాప్తు చేయలేదని ప్రశ్నించింది. రాజకీయ, నేర సంబంధమైన పరిశోధనాత్మక పాత్రికేయంలో 20 ఏళ్ల అనుభవం ఉన్న ప్రముఖ జర్నలిస్ట్ సరితా రాణి 'ద వైర్' వెబ్‌సైట్‌లో రాసిన రెండవ కథనంలో ఆసక్తికర విషయాలను ప్రస్తావించారు. ఆ వివరాలివీ..

**తీవ్ర గాయాలతో లేఖ రాయగలిగారా?**

వివేకా లేఖపై ఇప్పటికీ సందిగ్ధత తొలగిపోలేదు. సీబీఐ దస్తగిరిని అప్రూవర్‌గా మార్చి వాంగ్మూలం ఇప్పించే వరకు ఆ లేఖ ఎప్పుడు రాశారన్న దానిపై స్పష్టత రాలేదు. వివేకాపై దాడి తర్వాత ఆయనతో బలవంతంగా ఆ లేఖను తాము ఎలా రాయించిందీ దస్తగిరి వెల్లడించాకే సందేహాలు మరింత పెరిగాయి. దస్తగిరి తన వాంగ్మూలంలో వెల్లడించిన ప్రకారం.. మొదట సునీల్‌యాదవ్ వివేకానందరెడ్డి ముఖంపై గట్టిగా కొట్టాడు. దాంతో వివేకా కింద పడిపోయారు. ఉమాశంకర్ రెడ్డి గొడ్డలితో వివేకా నుదుట మీద నరికాడు. వివేకా నుదుటి మీద 3.5 ఇంచ్‌ల వెడల్పు, 6 ఇంచ్‌ల లోతుగా పక్క పక్కనే రెండు గాయాలున్నాయని పోస్టుమార్టం నివేదికలో ఉంది. సునీల్‌యాదవ్ వివేకా గుండెపై 15–16 సార్లు గట్టిగా పిడిగుద్దులు గుద్దాడు. ఉమాశంకర్ రెడ్డి తన చేతిలో ఉన్న గొడ్డలిని దస్తగిరికి ఇచ్చి వివేకా లేవకుండా చూడమని చెప్పారు. తాము భూమి పత్రాలు ఎక్కడున్నాయో వెతుకుతామని చెప్పాడు. వివేకా అతి కష్టం మీద లేవడానికి ప్రయత్నిస్తూ నా ఇంట్లో ఏం వెతుకుతున్నారని ప్రశ్నించారు. దాంతో దస్తగిరి గొడ్డలితో వివేకా కుడి చేతిపై దాడి చేశాడు. దీంతో వివేకా కుడి అరచేతిలో 2 ఇంచ్‌ల వెడల్పు, ఒక ఇంచి లోతున గాయం ఉందని పోస్టుమార్టం నివేదిక వెల్లడించింది. కుడి చేతి మీద గొడ్డలితో గాయపరిచిన తర్వాత వివేకాతో నిందితులు లేఖ రాయించారు. కుడి చేతివాటం వ్యక్తి అయిన వివేకా ఆ లేఖ రాశారని సీబీఐ పేర్కొంది. గాయం వల్ల వివేకా మెదడు బయటకు వచ్చిందని దస్తగిరి చెప్పడం గమనార్హం. అంత తీవ్ర గాయమయ్యాక లేఖ రాసే స్థితిలో వివేకా ఉన్నారా అన్నది ప్రశ్నార్థకం. ఆ లేఖ వివేకానే రాసినట్టు హైదరాబాద్‌లోని సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబరేటరీ నిర్ధారించింది. కాగా తీవ్రమైన ఒత్తిడి, అత్యంత సంక్లిష్ట ప్రక్రియ నడుమ ఆ లేఖ రాసినట్టుగా ఉందని ఢిల్లీలోని సీఎఫ్‌ఎస్‌ఎల్ నివేదిక వెల్లడించింది. కానీ అంతటి తీవ్ర గాయాలతో, మెదడు బయటకు వచ్చిన తర్వాత కూడా ఓ వ్యక్తి అలా లేఖ రాయడం సాధ్యమా? అని సీబీఐ వైద్య నిపుణులను సంప్రదించకపోవడం విడ్డూరం.

**ఆ వేలిముద్రలు ఎవరివో?**

హత్య కేసు దర్యాప్తులో వేలిముద్రలే కీలకం. అయితే వివేకా హత్యకు గురైన స్థలంలో గుర్తించిన 3 గుర్తు తెలియని వేలిముద్రలు ఎవరివనే దానిపై సీబీఐ ఇప్పటి వరకు దృష్టిసారించలేదు. వివేకా నివాసంలోని బాత్‌రూమ్ గోడల టైల్స్ మీద రెండు, తలుపు వెనుక ఒక వేలిముద్రను క్లూస్ టీమ్ గుర్తించింది. గోడల టైల్స్ మీద ఉన్న వేలిముద్రలు రక్తంతో ఉండటం గమనార్హం. కాగా ఆ మూడు వేలి ముద్రలు నిందితులు నలుగురితోపాటు వివేకా నివాసానికి వచ్చిన బంధువులు, ఇతరుల వేలి ముద్రలతో సరిపోలలేదు. అంటే గుర్తు తెలియని వ్యక్తులు ఆ రోజు రాత్రి వివేకా నివాసంలో ఉన్నట్టుగా భావించాల్సి వస్తోంది. కానీ సీబీఐ ఇప్పటి వరకు ఆ వేలిముద్రలు ఎవరివనే దిశగా దర్యాప్తు చేయలేదు.

**ఐపీడీఆర్ డేటా అహేతుకం**

ఎర్ర గంగిరెడ్డి, అవినాశ్‌రెడ్డి మధ్య వాట్సాప్ చాటింగ్ జరిగినట్టు 'ఇంటర్నెట్ ప్రొటోకాల్ డిటైల్ రికార్డ్స్(ఐపీడీఆర్) నివేదిక ఆధారంగా గుర్తించినట్టు సీబీఐ పేర్కొంది. 2019 మార్చి 14 అర్ధరాత్రి 1.37 నుంచి 5.02 గంటల వరకు వారిద్దరి మొబైల్ ఫోన్ల డేటా ఆన్‌లో ఉన్నట్టుగా చార్జ్‌షీట్‌లో పేర్కొంది. కానీ ఐపీడీఆర్ డేటా అన్నది శాస్త్రీయంగా కచ్చితమైన ఆధారం కాదు. ఆ సమయంలో మొబైల్ ఫోన్లు ఆన్‌లో ఉన్నాయని మాత్రమే ఐపీడీఆర్ చెబుతుంది. సాధారణంగా అర్ధరాత్రి దాటాక మొబైల్ నెట్‌వర్క్‌లు తమ డేటా బ్యాకప్ తీసుకుంటూ ఉంటాయి. దాంతో మొబైల్ డేటా ఆన్‌లో ఉన్నట్టు చూపిస్తుంది. అంత మాత్రాన ఆ మొబైల్ ఫోన్ల ద్వారా మాట్లాడుతున్నట్టుగానీ, మెసేజ్‌లు పంపిస్తున్నట్టుగానీ నిర్ధారించినట్టు కాదు. ఇక ఆ ఫోన్ల నుంచి ఇతర ఫోన్లకు మెసేజ్‌లు వెళ్లాయా.. లేదా అన్నది కూడా ఐపీడీఆర్ డేటా ద్వారా నిర్ధారించడం సాధ్యం కాదు. కాబట్టి ఎర్ర గంగిరెడ్డి, అవినాశ్‌రెడ్డి మధ్య ఆ రోజు రాత్రి వాట్సాప్ చాటింగ్ జరిగినట్టు ఐపీడీఆర్ డేటా ద్వారా నిర్ధారించలేం. ఈ విషయంలో సీబీఐ వాదన పూర్తిగా అహేతుకమని స్పష్టమవుతోంది. గంగిరెడ్డి మొబైల్ ఫోన్ నుంచి వెళ్లిన మెసేజ్‌లను గుర్తించేందుకు ప్రయత్నించినప్పటికీ సాధ్యపడలేదని సీబీఐ తెలిపింది. కాగా 2019 మార్చి 15నే ఎర్ర గంగిరెడ్డి మొబైల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. డేటాను పరిశీలించినా.. అందులో అనుమానాస్పదమైన సమాచారం లభించలేదని పోలీసులు ప్రకటించిన విషయం ప్రాధాన్యం సంతరించుకుంది.

**ఆస్తి వివాదాన్ని ఎందుకు పట్టించుకోలేదు?**

రాజకీయ కారణాలతోనే వివేకాను హత్య చేశారని సీబీఐ చార్జ్‌షీట్‌లో పేర్కొంది. కానీ దస్తగిరి, రంగన్న వాంగ్మూలాలను పరిశీలిస్తే ఆస్తి కోసం ఈ హత్య చేసి ఉండొచ్చన్నది స్పష్టమవుతోంది. ఎందుకంటే వివేకాను హత్య చేసిన తర్వాత నిందితులు ఆస్తి పత్రాల కోసం ఆయన నివాసంలో వెతికారన్నది స్పష్టమవుతోంది. నివాసంలో అల్మారా (బీరువా) తలుపు బద్దలు గొట్టడానికి ప్రయత్నించినట్టు పోలీసులు గుర్తించారు కూడా. అంటే హత్యకు ఆస్తి వివాదం ప్రధాన కారణం కావచ్చు. నిందితులు ఏ పత్రాల కోసం వెతికారన్నది సీబీఐ ఇప్పటి వరకు గుర్తించలేకపోయింది. దొంగతనం, ఆస్తి వివాదం అనే కోణంలో సీబీఐ ఈ కేసును ఎందుకు దర్యాప్తు చేయడం లేదన్నది ప్రశ్నార్థకంగా మారింది.

**ఒకే సమయంలో రెండుచోట్ల ఉండటం సాధ్యమా?**

సునీల్ యాదవ్ ఎక్కడ ఉన్నారనే దానిపై సీబీఐ వాదనలు మరింత అసంబద్ధంగా ఉన్నాయి. దస్తగిరిని అప్రూవర్‌గా మార్చి ఇప్పించిన వాంగ్మూలం, రంగన్న వాంగ్మూలం ప్రకారం ఆ రోజు రాత్రి 1.30 గంటల నుంచి 3 గంటల వరకు సునీల్ యాదవ్ వివేకానందరెడ్డి నివాసం లోపల ఉన్నాడు. కానీ ఆ రోజు రాత్రి 1.58 గంటలకు సునీల్ యాదవ్.. వైఎస్ భాస్కర్‌రెడ్డి నివాసంలో ఉన్నట్టుగా గూగుల్ టేక్ అవుట్ డేటా చూపిస్తోందని కూడా సీబీఐ పేర్కొంది. ఒకే సమయంలో ఒక వ్యక్తి వేర్వేరు చోట్ల ఎలా ఉండగలరు? సునీల్ యాదవ్ ఆ సమయంలో వైఎస్ భాస్కర్ రెడ్డి నివాసంలో ఉంటే.. అదే సమయంలో అక్కడికి కిలోమీటర్ దూరంలో ఉన్న వివేకా నివాసంలో కూడా ఉండి ఆయన్ను ఎలా హత్య చేయగలడు? మరి సీబీఐ ఇంత చిన్న అంశాన్ని విస్మరిస్తూ కేసు దర్యాప్తు చేస్తుండటం ఏమిటి?.

### రూ.40 కోట్ల డీల్ కథ తేల్చలేదెందుకు?

అసలు వివేకానందరెడ్డిని నిందితులు ఎందుకు హత్య చేశారనే అంశంపై సీబీఐ వాదన అసంబద్ధంగా ఉంది. దస్తగిరి వాంగ్మూలం ప్రకారం.. వివేకాను హత్య చేస్తే శివశంకర్ రెడ్డి రూ.40 కోట్లు ఇస్తారని ఎర్ర గంగిరెడ్డి తనతో చెప్పారని దస్తగిరి పేర్కొన్నాడు. అందుకు సునీల్ యాదవ్ ద్వారా దస్తగిరికి అడ్వాన్స్‌గా రూ.కోటి పంపించారు. అందులో రూ.25 లక్షలు సునీల్ యాదవ్ అప్పుగా తీసుకున్నాడు. ఆ డబ్బులతో పులివెందులలో విల్లా కొనుగోలు చేయాలని భావించినట్టు దస్తగిరి చెప్పాడు. కాగా ఇక్కడ ప్రశ్నార్థకం ఏమిటంటే.. వివేకా హత్య కోసం కుదిరినట్టు చెబుతున్న డీల్ డబ్బును సీబీఐ ఇప్పటికీ రికవరీ చేయలేకపోయింది. కేసు విచారణ సందర్భంగా తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి కూడా సీబీఐని ఇదే విషయంపై ప్రశ్నించారు. నిందితుల మధ్య చేతులు మారినట్టు చెబుతున్న డబ్బును ఎందుకు రికవరీ చేయలేకపోయారంటే సీబీఐ సరైన సమాధానం చెప్పలేకపోయింది. పులివెందులలో చెప్పుల దుకాణం నిర్వహిస్తున్న మున్నా బ్యాంక్ లాకర్ నుంచి రికవరీ చేసిన రూ.46.70 లక్షలకు సంబంధించి సీబీఐ చెబుతున్న వాదన నమ్మదగ్గదిగా లేదని కూడా న్యాయస్థానం వ్యాఖ్యానించడం గమనార్హం. 2020 సెప్టెంబర్ 9న మున్నా బ్యాంకు లాకర్లో ఉన్న రూ.46.70 లక్షలను సీబీఐ జప్తు చేసింది. ఈ జప్తు వ్యవహారం భారత సాక్ష్యాధారాల చట్టం సెక్షన్ 27 ప్రకారం లేదని న్యాయస్థానం స్పష్టం చేయడం గమనార్హం.

### గూగుల్ టేక్ అవుట్‌పై మాట మారింది!

నిందితులు 2019 మార్చి 14, 15 తేదీల్లో ఎక్కడ ఉన్నారనే విషయాన్ని గూగుల్ టేక్ అవుట్ ద్వారా నిర్ధారించామన్న సీబీఐ వాదన తప్పని తేలిపోయింది. ఎర్ర గంగిరెడ్డి, ఉమాశంకర్ రెడ్డి ఫోన్లు వారి ఇళ్లలోనే ఉన్నట్టుగా సెల్ టవర్ల లోకేషన్ స్పష్టం చేస్తోంది. కాగా సునీల్ యాదవ్ మొబైల్ ఫోన్ గూగుల్ టేక్ అవుట్ డేటాపై సీబీఐ ఎక్కువగా దృష్టి సారించింది. 2019 మార్చి 14 అర్ధరాత్రి 2.42కి సునీల్ యాదవ్ వివేకా నివాసంలో ఉన్నట్టు.. 2.34కి వివేకా నివాసానికి 15 మీటర్ల దూరంలో, 2.35కి వివేకా నివాసానికి 10 మీటర్ల దూరంలో ఉన్నట్టు.. 2.42కి వివేకా నివాసంలో ఉన్నట్టు పేర్కొంది. కాగా సునీల్ యాదవ్ నివాసం వివేకా నివాసానికి 160 మీటర్ల దూరంలోనే ఉంది. ఇది ఎంతో ముఖ్యమైన అంశం. ఎందుకంటే పట్టణ ప్రాంతాల్లో గూగుల్ టేక్ అవుట్ డేటాకు, వాస్తవ లొకేషన్‌కు 500 మీటర్ల నుంచి 1,500 మీటర్ల వరకు వ్యత్యాసం ఉంటుందని నిపుణులే చెబుతున్నారు. అందుకే ఈ కేసు విచారణ సమయంలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి ఆ విషయాన్ని ప్రశ్నించారు. గూగుల్ టేక్ అవుట్ డేటాను బట్టి ఎలా నిర్ధారించగలుగుతారని అడిగారు. దాంతో సీబీఐ తన మూడో అనుబంధ చార్జ్‌షీట్‌లో మాట మార్చింది. యూనివర్సల్ కాలమానానికి (యూటీసీ), భారత కాలమానానికి (ఐటీసీ) మధ్య వ్యత్యాసాన్ని తాము గమనించక పొరపాటు చేశామని వెల్లడించడం గమనార్హం. గూగుల్ టేక్ అవుట్ డేటాను విశ్లేషిస్తూ ఢిల్లీలోని సీఎఫ్‌ఎస్‌ఎల్ పేర్కొన్న సమయం యూటీసీ కాలమానం ప్రకారం అని వెల్లడించింది. వాస్తవానికి యూటీసీ కాలమానం కంటే భారత కాలమానం 5.30 గంటలు ముందుంటుంది. అంటే సునీల్ యాదవ్ వివేకా నివాసంలో 2019 మార్చి 14 అర్ధరాత్రి దాటిన తర్వాత 2.42 గంటలకు ఉన్నట్టు తాము మొదటి చార్జ్‌షీట్‌లో పేర్కొంది వాస్తవం కాదని సీబీఐ అంగీకరించింది. సునీల్ యాదవ్ వివేకా నివాసంలో 2019 మార్చి 15న ఉదయం 8.12కి ఉన్నారని తెలిపింది. అంటే వివేకా హత్యకు గురయ్యారని అందరికీ తెలిసిన తర్వాత కొన్ని వందల మంది అక్కడ గుమిగూడిన తర్వాత సునీల్ యాదవ్ చేరుకున్నారని చెప్పింది.

# నేతన్న కళకు పురస్కారం



గద్వాలలో చేనేత మగ్గాల పనితీరును పరిశీలిస్తున్న కలెక్టర్ వల్లూరి క్రాంతి (ఫైల్)

- రాష్ట్ర పురస్కారానికి ఉమ్మడి జిల్లా నుంచి తొమ్మిది మంది ఎంపిక

గద్వాల/అమరచింత: ఒక్కో పోగు జత చేసి.. కళాత్మకతతో వస్త్రంగా మార్చే నేతన్న కష్టం వెలకట్టలేనిది. ఆ శ్రమ వెనుక ఎన్నో ఒడిదొడుకులు దాగి ఉన్నాయి. దశాబ్దాలుగా వస్త్రాలపై వివిధ కళాకృతులను తీర్చిదిద్దుతూ ఔరా అనిపిస్తున్నారు. ఈ క్రమంలో వారిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత, జౌళి శాఖ అధ్వర్యంలో అందించే కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్రస్థాయి పురస్కారాలకు ఉమ్మడి జిల్లా నుంచి 9 మంది కార్మికులు ఎంపికయ్యారు. వీరిలో గద్వాల జిల్లా నుంచి ఐదుగురు, వనపర్తి జిల్లా నుంచి ఇద్దరు, మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల నుంచి ఒక్కొక్కరు చొప్పున చేనేత కార్మికులు ఉన్నారు. వీరికి ఈ నెల 7వ తేదీన హైదరాబాద్‌లో మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా పురస్కారం, రూ.25 వేల నగదు, ప్రశంసాపత్రంతో సత్కరించనున్నారు.

### ప్రత్యేక డిజైన్‌తో పట్టుచీర



సాంకేతికతను ఉపయోగించి విభిన్నమైన డిజైన్‌తో గద్వాల పట్టు చీరను నేసి పురస్కారాల పోటీకి పంపాం. శ్రీకృష్ణార్జున యుద్ధ రథం తరహాలో గుర్రాలతో కూడిన రథం, అందులో హంస, నెమలి బొమ్మలు ఉండే విధంగా డిజైన్ రూపొందించి 45 రోజులు కష్టపడి చీరను నేశాను. 30 ఏళ్ల నుంచి చేనేత వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాం. రాష్ట్ర పురస్కారానికి ఎంపిక కావడం సంతోషంగా ఉంది. – శిరీష, గద్వాల

### డిజైనింగ్‌లో నైపుణ్యం..



డిజైనింగ్‌లో నైపుణ్యం కనబర్చి గద్వాల పట్టుచీరను నేసి అందరి మన్ననలు పొందాం. 30 ఏళ్ల నుంచి చేనేత వృత్తిపై ఆధారపడ్డాం. గద్వాల జరీ సిల్క్ చీరను ఫుల్ టర్నింగ్ కుట్టు, సిల్వర్ అండ్ గోల్డ్ బూటాలతో రూపొందించాం. గొల్లభామ, సంక్రాంతి శోభ ఇతర అద్భుతమైన డిజైన్‌లతో పట్టుచీరలను నేశాను. దీంతో పాటు అనేక చీరలను కళాత్మకంగా రూపుదిద్దాం. – గోపాలకృష్ణ, గద్వాల

### సేవలకు గుర్తింపు..



నేత కార్మికుడిగా, రాజోళి చేనేత గ్రామిక సేవ సమితి పేరుతో అనేక సేవ కార్యక్రమాలు చేపట్టాం. వరదల సమయంలో, కరోన వంటి విపత్కర పరిస్థితులలో నేత కార్మికులకు సమితి తరుపున సాయం అందించాం. ముద్ర రుణాలు, సబ్సిడీలు, మగ్గాలు అందేవిధంగా కృషిచేశాం. ప్రస్తుతం కొంతమంది చేనేత కార్మికులను దత్తత తీసుకుని వారి ఆరోగ్య పరిరక్షణకు కృషిచేస్తున్నాం. తొలిసారి పురస్కారానికి ఎంపిక కావడంపై ఆనందంగా ఉంది. – వీరేష్, రాజోళి

### కళాత్మకతను రంగరించి..



కళాత్మకతను రంగరించి వినూత్నంగా వివిధ రకాల చీరలు రూపొందించడంలో ప్రావీణ్యుడు. వైవిధ్యమైన గద్వాల చీరలను నేయడంతో పాటు సాంప్రదాయ రంగులతో చీరలను నేసి అబ్బురపరిచారు. నాణ్యమైన జరీ అంచు, సైనిక్ కలర్, బార్డర్‌తో నేసిన చీర పురస్కారానికి ఎంపికైంది. కష్టానికి ఫలితంగా అవార్డు రావడం సంతోషంగా ఉంది – వెంకటేశ్వర్లు, గోర్లఖాన్‌దొడ్డి, గట్టు

### నైపుణ్యంతోనే గుర్తింపు..



ఇతరులకు భిన్నంగా పనిచేయాలనే ఉద్దేశంతో సాధారణ చీరల తయారీ కాకుండా కష్టమైన టరినింగ్ కుట్టు చీరను తయారు చేశాం. మరింత నైపుణ్యం జోడించి బూటాలను చెక్స్ డిజైన్‌తో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. 30 ఏళ్లుగా చేనేత కార్మికుడిగా పనిచేస్తున్నాను. మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా రాష్ట్ర పురస్కారం అందుకోనుండడం సంతోషంగా ఉంది. – అక్కల కాంతారాం, గద్వాల

### సంతోషంగా ఉంది..



అవార్డుకు నన్ను ఎంపిక చేయడం సంతోషంగా ఉంది. 45 ఏళ్ల నుంచి చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నా. కుటుంబం మొత్తానికి చేనేతనే జీవనాధారం. ప్రతిభను గుర్తించి అవార్డుకు ఎంపిక చేయడం ఆనందంగా ఉంది. – బాలస్వామి, అమరచింత

### 30 ఏళ్లుగా ఆధారం..



30ఏళ్లుగా మగ్గం పై ఆధారపడి పట్టు చీరలను నేస్తున్నాను. ప్రస్తుతం అమరచింత చేనేత ఉత్పత్తిదారుల సంఘంలో జరీ చీరలను తయారు చేస్తున్నాను. అవార్డుకు ఎంపిక కావడం గర్వంగా ఉంది. –పోతు రాధ, అమరచింత

# పట్టుదలతో శ్రమిస్తే లక్ష్యం సాధించొచ్చు

- ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పురుషోత్తం
- ప్రగతిచక్రం త్రైమాసిక పురస్కారాలు



మాట్లాడుతున్న ఈడీ పురుషోత్తం



పురస్కారాలు అందుకున్న ఉద్యోగులతో ఈడీ తదితరులు

స్టేషన్ మహబూబ్‌నగర్: పట్టుదలతో శ్రమిస్తే అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చని ఆర్టీసీ హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పురుషోత్తం అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో శుక్రవారం ఉత్తమ ఉద్యోగుల ప్రగతిచక్రం త్రైమాసిక పురస్కారాల కార్యక్రమం నిర్వహించారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూన్ వరకు ఉత్తమ ప్రతిభ కనబరిచిన డ్రైవర్లు, కండక్టర్లు, మెయింటెన్స్ సిబ్బందికి నగదు పురస్కారం, ప్రశంసాపత్రాలతో అభినందించారు. కార్యక్రమంలో ఈడీ పురుషోత్తం ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. మండు వేసవిలో కూడా ఆర్టీసీ ఉద్యోగులు ప్రయాణికులకు ఎంతో మెరుగైన సేవలు అందజేశారని కొనియాడారు. ప్రభుత్వంలో ఆర్టీసీ కలిసిన సందర్భంగా మరింత రెట్టింపు ఉత్సాహంతో చేయాలని సూచించారు. ఉద్యోగుల తరపున సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మహబూబ్‌నగర్ ఆర్టీసీ డిపో నష్టాలను అధిగమించి లాభాల్లోకి వచ్చి రాష్ట్రంలో ఉత్తమ పురస్కారం అందుకున్నదని, ఇదే స్ఫూర్తితో పనిచేయాలని ఉద్యోగులను సూచించారు. కార్పొరేషన్‌పరంగా రీజియన్ ముందంజలో ఉందన్నారు. డీఎస్పీ మహేష్ మాట్లాడుతూ ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితమని తెలిపారు. డ్రైవర్లు రోడ్డు ప్రమాదాలు కాకుండా జాగ్రత్తగా బస్సు నడపాలని సూచించారు. సమావేశంలో రీజినల్ మేనేజర్ శ్రీదేవి, డిప్యూటీ రీజినల్ మేనేజర్లు శ్యామల, బాబునాయక్, డీఎం సుజాత, సూపర్‌వైజర్లు, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

## జూరాలకు 53వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



గుడెందొడ్డి వద్ద కొనసాగుతున్న నెట్టెంపాడు నీటి పంపింగ్

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. గురువారం రాత్రి ప్రాజెక్టుకు 71వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, శుక్రవారం ఉదయం 6 గంటలకు 61వేల క్యూసెక్కులకు పడిపోయింది. 7 గంటలకు క్రమంగా పెరిగి 83,717 క్యూసెక్కులకు చేరింది. దీంతో 3 గేట్లను ఎత్తి వరద నీటిని దిగువకు విడుదల చేశారు. సాయంత్రం 3గంటలకు 51వేలు, రాత్రి 7గంటల వరకు 53వేల క్యూస్కెలకు పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. గేట్ల ద్వారా 12,231 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఆవిరి రూపంలో 91, నెట్టెంపాడు రెండు పంపుల ద్వారా 1,500, భీమా లిఫ్టు–1కు 650, లిఫ్టు–2కు 750, కోయిల్‌సాగర్‌కు 315, జూరాల ఎడమ కాల్వకు 730, సమాంతర కాల్వకు 800, క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 52వేల 404 క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు వైపు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 8.670 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువన ఉన్న ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులకు వరద కొనసాగుతుంది. ఎగువన ఉన్న ఆల్మట్టి ప్రాజెక్టుకు ప్రస్తుతం 84,222 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 42వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టుకు 44వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 38,944 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.


**11 యూనిట్లలో విద్యుదుత్పత్తి**

ఆత్మకూర్: దిగువ, ఎగువ జూరాల జలవిద్యుదుత్పత్తి కేంద్రాల్లో ఉత్పత్తి చేపడుతున్నారు. శుక్రవారం 12 యూనిట్లకు గాను, 11 యూనిట్ల ద్వారా 433 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేపట్టినట్లు ఎస్‌ఈ రామసుబ్బారెడ్డి, డీఈ పవన్‌కుమార్ తెలిపారు. ఎగువలో 5 యూనిట్ల ద్వారా 195 మెగావాట్లు, 39.690 ఎం.యూ., దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు, 39.673 ఎం.యూ. విద్యుదుత్పత్తిని చేపడుతున్నామన్నారు. ఇప్పటివరకు 79.363 మిలియన్ యూనిట్ల ఉత్పత్తిని సాధించామని, విద్యుదుత్పత్తికి 36,183 క్యూసెక్కులను వినియోగించారు.

**శ్రీశైలంలో 859 అడుగుల నీటిమట్టం**

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో శుక్రవారం 859 అడుగుల నీటిమట్టం, 102.8 టీఎంసీల నీటినిల్వ ఉంది. సాయంత్రం 6గంటల వరకు జూరాలలో స్పిల్‌వే ద్వారా 12,232, విద్యుదుత్పత్తి చేస్తూ 36,187 క్యూసెక్కుల నీటి ప్రవాహం దిగువున శ్రీశైలానికి విడుదల చేస్తున్నారు. 24గంటల వ్యవధిలో భూగర్భ కేంద్రంలో 4.265 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేసి 8,162 క్యూసెక్కుల నీటిని దిగువున సాగర్‌కు విడుదల చేశారు. జలాశయంలో 244 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.

### రామన్‌పాడుకు 1,430 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో శుక్రవారం 1,020 అడుగులకు నీరు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 730, సమాంతర కాల్వ ద్వారా 700 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఎన్టీఆర్ కాల్వ ద్వారా వ్యవసాయ అవసరాల కోసం 850, కుడి కాల్వ ద్వారా 10, ఎడమ కాల్వ ద్వారా 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. భీమా ఫేజ్ 2 ద్వారా 847 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ రనిల్‌రెడ్డి తెలిపారు.